క్లుప్తంగా

పోలేరమ్మకు పొంగళ్లు



అనుమసముద్రంపేట: మండలంలోని చిరమనలో పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలేరమ్మ ఆలయ జీర్ణోద్ధరణ చేపట్టి 40 రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు సామూహికంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పిచ్చితీగల తొలగింపు



సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీలో ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి అల్లుకుపోయిన పిచ్చి తీగలను విద్యుత్ సిబ్బంది తొలగించారు. సాక్షిలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ సిబ్బంది స్పందించారు. స్తంభాన్ని అల్లుకున్న పిచ్చి తీగలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులోని పురాతన శ్రీరుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద అగ్నిగుండ మహోత్సవాన్ని ఆదివారం వేకువజామున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని యువతీయువకులు నెల రోజులు పండరి భజన నేర్చుకుంటున్నారు. అందులో భాగంగా శనివారం రాత్రి గజ్జె పూజ నిర్వహించి భజనలు చేశారు. అనంతరం వేకువజామున అగ్నిగుండం తొక్కారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

జిల్లా మహాసభలకు తరలిన రైతుసంఘ నాయకులు



ఆత్మకూరురూరల్: నెల్లూరులో ఆదివారం నుంచి నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలకు ఆ సంఘం ఆత్మకూరు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా మహాసభల్లో తీర్మానాలను చేయనున్నట్లు తెలిపారు. సీపీఎం సీనియర్ నాయకుడు లక్ష్మీపతి, కేసీ కృష్ణయ్య, గద్దర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

ఆత్మకూరు: పట్టణ పరిధిలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన మున్సిపల్ మార్కెట్‌లో వ్యాపారులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా తొలుత మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తున్నామన్నారు. కొనుగోలుదారులు సంచులను తెచ్చుకోకుండా కవర్లను అడిగితే రూ.20 వసూలు చేయాలని వ్యాపారులకు సూచించారు. దీన్ని సోమవారం నుంచి అమల్లోకి తీసుకురావాలన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

కలిగిరి: తూర్పుగుడ్లదొన శివారులోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై ఉమాశంకర్ తన సిబ్బందితో ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు కోడిపుంజులు, రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తుంటే 94407 00098 నంబరుకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

నత్తనడకన దగదర్తి-బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు పనులు

- గత ప్రభుత్వ హయాంలో మంజూరు
- కూటమి ప్రభుత్వం వచ్చాక బిల్లుల మంజూరులో జాప్యం
- పనులను నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న రెండు మండలాల ప్రజలు

దగదర్తి: దగదర్తి-బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో రెండు మండలాల ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. ఇటీవల రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలతో నిండి వర్షం పడితే ఎక్కడ గుంత ఉందో..ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ పనులను మంజూరు చేశారు. కాంట్రాక్టర్ కొంత మేర పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం బిల్లుల మంజూరులో జాప్యం చేయడంతో పనులను నిలిపివేశారు. రోడ్డు పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పూర్తి చేయించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనచోదకుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.38కోట్లు మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దగదర్తి-బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు విస్తరణ పనులకు రూ.38 కోట్లు మంజూరు చేశారు. తురిమెర్ల వద్ద ఫైడేరుపై వంతెన నిర్మాణానికి మరో రూ.3 కోట్లు మంజూరు చేశారు. దగదర్తి, బుచ్చిరెడ్డిపాళెం మండలాలను అనుసంధానం చేస్తూ 16 గ్రామాల మీదుగా వెళ్లే ఈ రోడ్డు విస్తరణ పనులను టెండర్ల ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. రహదారి విస్తరణకు ఇరువైపులా ఉన్న భూముల సేకరణకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు వేగవంతంగా చర్యలు చేపట్టారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరికి తోడు కూటమి ప్రభుత్వం బిల్లుల మంజూరులో జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు 50 శాతం పనులు కూడా పూర్తికాలేదు. తురిమెర్ల-చెన్నూరు మధ్యన 5 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. అలాగే చెన్నూరు, దగదర్తిలో రెండు కిలోమీటర్ల మేర సీసీరోడ్డు పనులు పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి రూ.10 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం బిల్లులను మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు.



చెన్నూరు-దగదర్తి నడుమ గుంతలతో నిండిన రోడ్డు

భూపరిహారం పంపిణీలో జాప్యం

దగదర్తి-బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దగదర్తి-చెన్నూరు గ్రామాల మధ్యన ఇరువైపులా భూసేకరణకు సంబంధించి పరిహారం పంపిణీ విషయంలో తొలుత రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 41 మంది రైతుల నుంచి రెండున్నర ఎకరాలు భూమిని అధికారులు సేకరించాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి భూపరిహారంగా సుమారు రూ.33 లక్షలను మంజూరు చేసింది. అప్పట్లో భూసేకరణను వ్యతిరేకించిన కొంతమంది టీడీపీ మద్దతు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భూపరిహారం చెల్లింపు ప్రక్రియ నిలిచిపోయింది. సాగునీటి కాలువలు రహదారి పక్కనే ఉన్నాయని, రోడ్డు విస్తరణలో వాటిని తొలగిస్తే సాగునీరు ఎలా అందుతుందని, ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ కారణంగా దగదర్తి-చెన్నూరు మధ్యన రహదారి విస్తరణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం రైతులు భూపరిహారం తీసుకొనేందుకు ముందుకొచ్చినా గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఆర్థిక శాఖ వెనక్కు తీసుకోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. మళ్లీ భూపరిహారం కోసం ఆర్థిక శాఖకు ప్రతిపాదనలను పంపామని, నిధులు మంజూరవగానే అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. సాగునీటి కాలువల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగవంతం చేయించి వర్షాకాలంలోగా పూర్తి చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

> **రోడ్డు పనులను పూర్తిచేయిస్తాం**
>
> తురిమెర్ల వద్ద ఫైడేరుపై బ్రిడ్జి నిర్మాణానికి ఫారెస్ట్ అనుమతులు రాకపోవడంతో జాప్యం జరుగుతోంది. తురిమెర్ల-చెన్నూరు మధ్యన బీటీ నిర్మాణం పూర్తయింది. చెన్నూరు, దగదర్తిలో రెండు కిలోమీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను వేగవంతం చేయిస్తాం.
>
> –భరత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

రాజరాజేశ్వరీదేవికి విశేష పూజలు



సంగం: స్థానిక తిరుమన కొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి పీఠంలో అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత సకల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి శ్రీచక్ర నవావరణ కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం లలితారుద్రమహాయజ్ఞం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అలాగే కోలగట్లలోని నాగార్పమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

ముమ్మరంగా గణాంక సర్వే



ఆత్మకూరు: పట్టణంలో కేంద్ర ప్రభుత్వ గణాంక సర్వేను ముమ్మరంగా చేపడుతున్నారు. గత రెండ్రోజుల నుంచి ప్రత్యేక సర్వే బృందాలు పట్టణంలోని వార్డుల పరిధిలో ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యులు వివరాలు, వారి విద్యార్హతలు, నిరుద్యోగులు, ఉద్యోగుల వివరాలు, ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని నమోదు చేసుకుంటున్నారు.

ధరల్లేక దోస రైతు విలవిల

ఉదయగిరి : ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో రైతులు విస్తారంగా దోస సాగు చేశారు. రెండు నెలల క్రితం కురిసిన వానలకు మెట్ట రైతులు పంట సాగు చేపట్టారు. మరికొంత మంది రైతులు కందిలో అంతర పంటగా సాగు చేశారు. ప్రస్తుతం కాయలు కోతకు వచ్చాయి. హైదరాబాదు, గుంటూరు, విజయవాడ, నంద్యాల తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే పదిహేనురోజుల క్రితం బస్తా కాయల ధర రూ.700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.300కు దిగజారింది. మార్కెట్లో ధరలు బాగానే ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించేశారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. మరో నెల రోజుల వరకు కాయల దిగుబడి ఉంటుంది. రోజురోజుకు ధరలు పతనం అవుతున్న నేపథ్యంలో దోస రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలను స్థిరీకరించి రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మందుబాబులకు అడ్డాగా ప్రార్థనా స్థలాలు

ఉదయగిరి రూరల్: సమాజంలో హిందు, ముస్లిం, క్రైస్తవ సోదరులు తమ ప్రార్థనా మందిరాలు, స్థలాలను పరమ పవిత్రంగా భావిస్తూ కాపాడుకుంటుంటారు. అయితే అలాంటి ప్రార్థనా మందిరాలు, పవిత్ర స్థలాలు నేడు అపవిత్రం అవుతున్నాయి. మందుబాబులు ప్రార్థనా మందిరాలు, విద్యాలయాలు అనే తేడాలు లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తూ అపవిత్రం చేస్తున్నారు. గండిపాళెంలో ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు నిర్వహించే ఈద్గా వద్ద రాత్రివేళల్లో మందుబాబులు మద్యం సేవించి ఖాళీ మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, తినుబండరాలను అక్కడ పడేస్తూ అపవిత్రం చేస్తున్నారు. అలాగే గండిపాళెం జలాశయం వద్దకు వెళ్లి అక్కడ మద్యం సేవిస్తుండడంతో సందర్శకులు, ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



ఈద్గా వద్ద తాగి పడేసిన మద్యం సీసాలు

చలానా..45 రోజుల్లో కట్టాల్సిందే

- ఐదుకు మించితే లైసెన్స్ రద్దు
- కేంద్ర మోటారు వెహికల్ రూల్స్ 1989 సవరణకు ప్రతిపాదన

సీతారామపురం : ట్రాఫిక్ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. నిబంధనలు పాటించకపోతే భారీ వడ్డనకు సిద్ధమవుతోంది. చలానా పడితే పోలీసులు ఆపినప్పుడు చూద్దాంలే అంటే ఇకపై కుదరదు. 45 రోజుల్లోగా చెల్లించకపోతే వాహనాన్ని స్వాధీనం చేసుకోనున్నారు. అంతేకాదు డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కాకపోవచ్చు. ఐదుకు మించి చలానాలు ఉంటే ఏకంగా లైసెన్స్‌నే రద్దు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర రవాణాశాఖ సవరణలను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్‌ను తాజాగా కేంద్రం విడుదల చేసింది. ఇక ముందు వాహనచోదకులు ట్రాఫిక్ విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందే. నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదని రవాణా శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రతిపాదించిన రూల్స్ ప్రకారం...

చలానాల జారీ, చెల్లింపు, అప్పీల్ చేయడం వంటి అంశాలను డిజిటల్ మానిటరింగ్ ఆపరేషన్ ద్వారా వేగవంతం చేయనున్నారు. మోటార్ వెహికల్ యాక్ట్ కింద ఒక వాహనంపై ఐదు, అంతకుమించి చలానాలు జారీ అయితే డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు. మద్యం సేవించి వాహనం నడిపినా, నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైనా లైసెన్స్‌ను రద్దు చేసే వెసులుబాటు ఇప్పటికే ఉండగా ఆ నిబంధనలు కూడా కొనసాగుతాయి. ప్రస్తుతం చలానా చెల్లింపునకు 30 రోజుల సమయం ఉండేది. ఆ గడువు దాటినా పోలీసులు పట్టుకుంటే తప్ప వాహన చోదకులు స్పందించేవారు కాదు. ప్రస్తుతం గడువు 45 రోజులకు తగ్గించారు. ఆలస్యం చేస్తే సదరు వాహనంపై రవాణా శాఖ లావాదేవీలను స్తంభింపజేస్తుంది. దీంతో వాహనాన్ని ఎవరికి విక్రయించలేరు. అలాగే లైసెన్సులో చిరునామా పేరు మార్పుతో పాటు రెన్యువల్ కూడా జరగదు. చలానా కట్టకపోతే వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం ఇకపై పోలీసులకు కూడా ఉంటుంది. ఇప్పటి వరకు చలానాలు వాహన చోదకుడి పేరుతో జారీ అయ్యేవి. ఇకపై ఆ సమయంలో యజమాని వాహనం నడపలేదని నిరూపిస్తే డ్రైవింగ్ చేసిన వ్యక్తిని బాధ్యుడిని చేస్తారు.

ప్రతిపాదనలు అమల్లోకి వస్తే

ఇప్పటి వరకు పోలీసులు చలానాల విషయంలో ఉభయ తారక మంత్రాన్ని అనుసరిస్తున్నారు. వాహనంపై ఎన్ని చలానాలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ తనిఖీ సమయంలో ఒకటి, రెండు చలానాలను చెల్లించుకుని మిగిలినవి వీలైనంత త్వరగా క్లియర్ చేసుకోమని సూచించి వదిలిపెట్టేవారు. దీంతో ప్రభుత్వానికి కొంత మేరకైనా చలానా రూపంలో ఆదాయం రావడంతో పాటు వాహన చోదకులకు కూడా ఇబ్బంది ఉండేది కాదు. ఇందుకోసమే పోలీసులు మీసేవ లేదా ఇతర నెట్ సెంటర్లు అందుబాటులో ఉండే ప్రాంతాన్ని ఎంచుకుని అక్కడే తనిఖీలు చేపట్టేవారు. అంతకుముందు చలానాల వసూళ్లలో పోలీసులపై ఆరోపణలు ఉండేవి. మ్యాన్యువల్ క్లియరెన్స్ వల్ల వసూలు చేసిన చలానాల డబ్బులు కొంత దారి మళ్లేవన్న విమర్శలు వచ్చేవి. వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ చెల్లింపు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలోనే మీసేవ, నెట్ సెంటర్లు ఉన్నచోటే తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే కేంద్ర రవాణా శాఖ తాజాగా తెరపైకి తీసుకొస్తున్న ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ఐదు అంతకుమించి చలానాలు పెండింగ్ ఉంటే వాహనచోదకుల లైసెన్స్ రద్దు అవుతుంది.

బాధితులకు న్యాయం చేయాలని ఆందోళన నేడు

ఆత్మకూరురూరల్: ఇటీవల సంగం మండలం పెరమన వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారాన్ని వెంటనే అందించాలని కోరుతూ ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఇసుక టిప్పర్ డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షలు చొప్పున పరిహారాన్ని అందజేయాలనే డిమాండ్లతో ఆందోళన చేపడుతున్నామని పేర్కొనారు. అనంతరం ఆర్డీఓ భూమిరెడ్డి పావనికి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ పోస్టుకు గెస్ట్‌లెక్చరర్ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 55 శాతానికిపైగా మార్కులు సాధించి అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు సోమ, మంగళవారాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 15న ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు: మండలంలోని నల్లపరెడ్డిపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు.. కనుపూరుపల్లిలో వరికోసేందుకు వెంకటాచలం మండలానికి చెందిన వరికోత మెషీన్‌తో పాటు వెంకటేశ్వర్లు, హేమంత్ వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం వారు మోటార్‌సైకిల్‌పై ఆత్మకూరుకు వచ్చారు. హోటల్‌లో భోజనం చేసి వరి కోత మెషీన్ వద్ద ఉన్న వారి కోసం భోజనాలు కట్టించుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనచోదకుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు, హేమంత్ గాయపడ్డారు. క్షతగాత్రులను ఎస్సై జిలానీ ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాగునీరు ముందుకు సాగేదెలా?

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయానికి చెందిన ప్రధాన కుడి, ఎడమ కాలువలపై కంపచెట్లు ఏపుగా పెరిగిపోయి ఉన్నాయి. కొన్నిచోట్ల కంపచెట్లు కాలువలోకి ఒరిగిపోయి ఉన్నాయి. మరోవైపు కాలువల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి ఉన్నాయి.దీంతో గండిపాళెం జలాశయం పరిధిలోని సాగు భూములకు సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ఇటీవల టీడీపీ నాయకులు కాలువలపై కంపచెట్ల తొలగింపు పేరుతో నామమాత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఏడాది గడవక ముందే కాలువలు అధ్వానంగా మారాయి. దీంతో జలాశయం నుంచి సాగునీరు వదిలినా ముందుకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వ అధికారులు స్పదించి కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గండిపాళెం కాలువపై దట్టంగా పెరిగిన కంపచెట్లు

పచ్చదనం పరవళ్లు



ఉదయగిరి మండలం గండిపాళెం జలాశయం సమీపంలో పొలాలు పచ్చదనం పరుచుకున్నాయి. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలకు బోర్ల కింద ముందస్తుగా నార్లు పోసిన రైతులు నాట్లు వేయడంతో పొలాల్లో పచ్చదనం వెల్లివిరుస్తోంది. పంట పొలాల వెంబడి ప్రధాన రహదారిపై వెళ్లే పాదచారులు, వాహనచోదకులు పచ్చదనాన్ని చూసి ఆస్వాదిస్తున్నారు.

– ఉదయగిరి రూరల్

మూలకు చేరిన ఫాగింగ్ మెషీన్లు

- గ్రామాల్లో దోమలు స్వైరవిహారం
- విషజ్వరాల బారిన ప్రజలు

సీతారామపురం : గ్రామాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యం లోపించి దోమలు ప్రబలుతున్నాయి. రేయింబవళ్లు దోమలు దండయాత్ర సాగిస్తుండడంతో ప్రజలు డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు తరచూ ఫాగింగ్ చేపడుతూ దోమలను నివారించాల్సిన పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దోమల నివారణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లోని ప్రతి సచివాలయానికి ఒకటి చొప్పున రూ.50వేల విలువైన ఫాగింగ్ మెషీన్లను అందజేశారు. వీటిని పంచాయతీ పాలకులు మూలన పడేశారు. ఉదయగిరి నియోజకవర్గంలోని చాలా మండలాల్లో వీటిని అసలు వినియోగించిన దాఖలాలు కూడా లేవు. ఫాగింగ్ మెషీన్‌ను ఒకసారి వాడేందుకు రూ.5 వేలు ఖర్చవుతుండడంతో పంచాయతీలు ఆర్థిక భారంతో వెనకడుగు వేస్తున్నాయి. మైనర్ పంచాయతీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వస్తున్నారంటే ముందు రోజు కాలువలు, రోడ్లపై ప్రవహించే మురుగును శుభ్రం చేయిస్తున్నారు. అనంతరం షరా మామూలే. దీంతో దోమల బెడదతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సింగారెడ్డిపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న ఇళ్లలోని మురుగు



సీతారామపురంలోని ఓ వీధిలో సీసీరోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

> **ఫాగింగ్ చేపట్టేలా చర్యలు**
>
> ఫాగింగ్ మెషీన్లు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతులకు గురైన వాటిని బాగుచేయిస్తాం. ఆర్థిక భారంతో ఫాగింగ్ చేయించేందుకు పంచాయతీ కార్యదర్శులు ముందుకు రావడం లేదు. అయినా ఈ విషయంలో రాజీలేకుండా పనిచేసేలా చర్యలు చేపడతాం.
>
> – రామనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ, సీతారామపురం



సీతారామపురం సచివాలయంలో నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రం